

జిఒ1 రద్దు వరకూ పోరాటం

జిఒ కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలోని రహదారులు, కూడళ్లలో సభలు, ర్యాలీలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ-1 కాపీలను భోగిమంటల్లో దహనం చేయాలని, జిఒను రద్దు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలో జిల్లాలోని చేతివృత్తిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బుధవారం స్థానిక ఆర్ఆర్.పేటలోని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ కాలం నాటి పోలీస్ యాక్టును తీసుకురావడం అన్యాయమన్నారు. దీన్ని ప్రతిఒక్కరూ తిరస్కరించాలన్నారు.



6733 మందికి జగనన్న తోడు లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

చిరువ్యాపారులకు జగనన్న తోడు ఊతంగా నిలుస్తుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం ఈ పథకం ఆరో విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, ఇప్పటికే రుణాలు పొంది సకాలంలో చెల్లించినవారికి సంబంధించిన వడ్డీ రాయితీని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు, మెప్మా పిడి ఇమ్మానియేల్, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ఆరో విడతలో జిల్లాలో 6,733 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.6.73 కోట్లు లబ్ధిదారులకు జమచేశామన్నారు. ఇప్పటికే రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 29,300 మంది లబ్ధిదారులకు రూ.73 లక్షల వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద లబ్ధిదారులకు జమచేశామని తెలిపారు. చిరు వ్యాపారులకు ఈ పథకం అండగా నిలుస్తోందని, తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే, తిరిగి వడ్డీలేని రుణాలు పొందొచ్చన్నారు. జిల్లాలో ఈ విడతలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో చిరువ్యాపారాలు చేసుకునే 3,856 మందికి ప్రభుత్వం వడ్డీలేని రుణాలు మంజూరయ్యాయన్నారు. పట్టణాల్లో 2,877 మందికి ఎలాంటి పూచీకత్తులేకుండా ఒక్కో లబ్ధిదారునికి రూ.10 వేలు చొప్పున రుణాలు అందిస్తున్నామన్నారు. అనంతరం చిరువ్యాపారులకు నమూనా చెక్కులను అందజేశారు.

ఉప్పు కయ్యలు.. వరి పొలాలు..!

నిడమర్రు మండలంలో పరిస్థితి దారుణం

ఉప్పునీటి రొయ్యసాగుతో చౌడుబారిన వరి పొలాలు

పంట కాలువల్లోకి యథేచ్ఛగా ఉప్పునీరు విడుదల

కొల్లేరును ఆనుకుని ఉన్న వేలాది ఎకరాల వరిపొలాలు నాశనం

రబీ నాట్లు వేయకుండా బీడుగా భూములను వదిలేస్తున్న రైతులు

తమకు న్యాయం చేయాలని రైతుల వేడుకోలు



ఉప్పునీటి ప్రభావంతో దెబ్బతిన్న వరిపైరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిబంధనలకు విరుద్ధంగా సాగవుతున్న ఉప్పునీటి రొయ్యల సాగుతో పచ్చని పంట పొలాలన్నీ బీడు భూములుగా మారుతున్నాయి. ఉప్పునీరు చేరి భూములన్నీ చౌడుబారడంతో నాట్లు నాటినా పనికిరాకుండాపోతున్నాయి. దీంతో మొన్నటి వరకూ ఎకరాకు 50 బస్తాల దిగుబడి వచ్చే వరి భూములను సైతం రైతులు బీడుగా వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లోనూ అనేక మండలాల్లో ఈ పరిస్థితి ఉన్నప్పటికీ నిడమర్రు మండలంలో మాత్రం పరిస్థితి దారుణంగా తయారైంది. ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు వంటి మండలాలతోపాటు ఆకివీడు వంటి అనేక మండలాల్లో కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో వరిసాగు సాగుతోంది. కొల్లేరును ఆనుకుని భూములు వర్షాకాలం ముంపునకు గురయ్యే పరిస్థితి ఉండటంతో రైతులు కేవలం రబీసాగు మాత్రమే చేపడతారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రెండు జిల్లాల్లోని పలు మండలాల్లో కొల్లేరును ఆనుకుని వేలాది ఎకరాల పంట భూములు ఉన్నాయి. అభయారణ్యం కారణంగా ఈ భూముల్లో చేపల చెరువుల తవ్వకాలకు అనుమతులు లేవు. దీంతో రైతులు ఈ భూముల్లో వరిసాగు మాత్రమే చేస్తుంటారు. ఈ భూములకు పైభాగంలో ఉన్న పొలాలన్నీ రొయ్యల చెరువులుగా మారిపోయాయి. చెరువుల్లోని ఉప్పునీటిని పంటకాలువల్లోకి వదిలేయడంతో పచ్చని పంట పొలాలన్నీ తీవ్రంగా దెబ్బతింటున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఉప్పునీటి బోర్లు

నిబంధనల ప్రకారం ఉప్పునీటి రొయ్యలసాగు నిషిద్ధం. నిబంధనలకు విరుద్ధంగా ఉప్పునీటి బోర్ల తవ్వకాలు జరిపి రొయ్యలసాగు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. విద్యుత్ కనెక్షన్లు కూడా ఏర్పాటు చేసి ఉప్పునీరు తోడేస్తున్నారు. జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో చేపల చెరువులు ఉండగా మూడొంతుల చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉప్పునీటి రొయ్యలసాగు సాగుతోంది. చెరువుల్లో నింపుతున్న ఉప్పునీటిని రొయ్యల పట్టుబడి పట్టినప్పుడు పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఈ నీరు కొల్లేరును ఆనుకుని ఉన్న వరి పొలాల్లోకి చేరుతోంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. రైతులు అనేకసార్లు ధర్నాలు, ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో పంట భూములన్నీ చౌడుబారిపోయాయి. నారుమడులు వేస్తే బతకడం లేదు. నాట్లు నాటితే మొక్కలు చనిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో రైతులకు ఏం చేయాలో తెలీని పరిస్థితి ఏర్పడింది. ఈ భూములన్నీ చిన్న, సన్నకారు రైతులవే. నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన కలంటకోడు పాయలోని భూములు పూర్తిగా పండని పరిస్థితికి చేరాయి. దీంతో ప్రస్తుత రబీలో చాలామంది రైతులు తమ భూములను సాగు చేయకుండా వదిలేస్తున్నారు. సాగు చేసినా పంట పండని పరిస్థితి ఉంది. దీంతో పెట్టుబడుల రూపంలో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ప్రభుత్వం నష్టాలు భరించలేక భూములను సాగు చేయకుండా వదిలేస్తున్నారు. అభయారణ్యం పేరుతో ఒకపక్క చేపల చెరువుల తవ్వకాలకు అనుమతివ్వకుండా, మరోపక్క ఉప్పునీటిని పంటకాలువల్లోకి రాకుండా నిరోధించకపోవడంతో పంట భూములన్నీ బీడు భూములుగా మారిపోతున్నాయి. ఈ విధంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పంటలు పండకపోవడంతో ఆ భూములు ఎవరూ కొనే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - వేలేరుపాడు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు మండల అధ్యక్షులు సువ్వేటి లత ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న సిఐటియు జిల్లా కార్యదర్శి మడివి దుర్గారావు మాట్లాడుతూ సెంటర్ల తనిఖీల పేరుతో అధికారుల వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఫేస్ యాప్ అటిండెన్స్‌ను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో సుమిత్ర, జన్మకుమారి, చంద్రకాంత, సరస్వతి, సుజాత, శారద, చంద్రకళ, సుహాసిని పాల్గొన్నారు



పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న వనిత

పోలీస్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

ఆగిరిపల్లి: మహిళల రక్షణ, భద్రతే ధ్యేయంగా సిఎం జగన్ పోలీసు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం ఆగిరిపల్లిలో నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆమె ప్రారంభించారు. తొలుత ఆమె స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ అంకితభావంతో, నిబద్ధతతో పనిచేయాలన్నారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఆర్థిక సాయం చేసిన దాతలను ఆమె సన్మానించారు. ఐజి పాలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైం రేటు తగ్గడంలో పోలీసుల పాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు, ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ్, రూరల్ సిఐ అంకబాబు, ఆగిరిపల్లి ఎస్సై చంటిబాబు, జెడ్‌పిటిసి సభ్యులు వీరబాబు, ఎపిపి అనూష, ఆగిరిపల్లి సర్పంచి లక్ష్మీ విక్టర్‌బాబు, ఎంపిటిసిలు గోపినాథ్ పాల్గొన్నారు.

సిఐటియు ఆలిండియా మహాసభ జయప్రదం చేయాలి

నిడమర్రు: బెంగుళూరులో ఈ నెల 18 నుంచి జరిగే సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎస్.మోహన్‌రావు, అంబాల సాయిగణేష్. కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్, కె.శోభన్‌బాబు, జి.సత్యనారాయణ, డి.వెంకట్రావు, ఎం.మురళీ, బి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఎయిమ్ చేయూత

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిభావంతులకు ఎయిమ్ ఆపన్నహస్తం అందిస్తుందని రాష్ట్ర సిఐడి డిజిపి పివి.సునీల్‌కుమార్ అన్నారు. చింతలపూడిలోని హోటల్ ఎం ఫంక్షన్ హాలు వద్ద నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల కోచింగ్ సెంటర్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. అభ్యర్థులకు మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఎయిమ్ చేయూతనిస్తుందన్నారు. విదేశీ విద్య కోసం వెళ్లే వారికి సాయం చేస్తామని చెప్పారు. కుల, మతాల తేడా లేకుండా అందరికీ చేయూతనివ్వడమే లక్ష్యమన్నారు. జీవితంలో కష్టపడితే ఏదైనా సాధించగలమనే నమ్మకం అందరిలోనూ ఉండాలని, అదే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. పరాజయాల గురించి ఆలోచన లేకుండా గెలిచేవరకూ పోరాడుతూనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కేరళ మాజీ అడిషనల్ డిజిపి పి.విజయానంద్, ఎయిమ్ రాష్ట్ర అధ్యక్షులు మాదిరి రాంబాబు, నాయకులు కాకర్ల సత్యం, రాజేంద్ర, బుచ్చిబాబు, విల్సన్, రాజు, రాష్ట్ర లేబర్ బోర్డ్ వైస్‌ఛైర్మన్ డి.నవీన్‌బాబు, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జానకిరెడ్డి, ఎంపిపి డాక్టర్ రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.నీరజ, కమిషనర్ ఎన్.రాంబాబు పాల్గొన్నారు.

గుండుగొలనులో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

ప్రజాశక్తి - భీమడోలు

అమెరికాకు చెందిన గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, గ్లోబల్ గ్రేస్ హెల్త్ సంస్థ గుండుగొలనులో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రారంభించారు. కోరారు. సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ చేబత్తిన ఏసుదాసు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో అన్ని రకాల కేన్సర్లకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అంతేకాక గుండె, ఇతరవ్యాధులకు సైతం పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ అధ్యక్షులు కె.రామయ్య, ఎస్.కొండబాబు, గుండుగొలను సొసైటీ అధ్యక్షులు వివివి.భాస్కర్, యుటిఎఫ్ నాయకులు నంబూరి రాంబాబు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

జీలుగుమిల్లి: తాటియాకులగూడేనికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడ్డాడంటూ గ్రామానికి చెందిన సాయి అనే వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేయడంతో బుధవారం ఎపిడి ప్రఫుల్ విచారణ చేపట్టారు. ఉపాధి పనులకు రానివారికి కూడా మస్తర్లు వేశారని జనవరి రెండో తేదీన స్పందనలో ఫిర్యాదు చేశారు. అలాగే ఉద్యానవన శాఖకు సంబంధించి పామాయిల్ మొక్కలు ఇప్పిస్తానని రైతుల వద్ద నుంచి డబ్బు తీసుకుని మోసగించాడని ఫిర్యాదు చేశారు. వీటిపై విచారించిన ప్రఫుల్ మాట్లాడుతూ వీరి ఆరోపణలపై సమగ్ర వివరాలు సేకరించి రికార్డ్ వెరిఫికేషన్ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. సమగ్ర విచారణ అనంతరం చర్యలుంటాయన్నారు. ఆయనతో పాటు ఎపిఒ జాన్ వెస్లీ, సర్పంచి వనమా రాంబాబు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఆధ్వర్యాన ఆటల పోటీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లాలో పలుచోట్ల కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. వ్యకాస, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వైభవంగా ఈ పోటీలు నిర్వహించారు. మహిళలు, యువకులు పెద్దఎత్తున ఈ పోటీల్లో పాల్గొన్నారు.

కుక్కునూరు: సంక్రాంతి సందర్భంగా మండవ రామిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి కుమారుడు మండవ శ్యామ్ సుందర్ రెడ్డి సహకారంతో వ్యకాస ఆధ్వర్యంలో ఈ నెల11 నుండి 14వ వరకూ స్థానిక రామసింగారం పాఠశాలలో నిర్వహిస్తున్న ఆటల పోటీలను పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు బుధవారం ప్రారంభించారు. డివిజన్ స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, షటిల్, రేలా డ్యాన్స్ గిరిజన సాంప్రదాయనృత్య పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల వైపు పోకుండా గ్రామాలో సాంప్రదాయ క్రీడలు, పాటలు, కళారూపాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వ్యకాస ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్న ట్రస్ట్ ఛైర్మన్ మండవ శ్యామ్ సుందర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు, జెడ్‌పిటిసి సభ్యులు కుంజా నాగేశ్వరరావు, ఎంపిపి చేబ్రోలు గీతావాణి, సర్పంచి రావు మీనా, సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాసరావు, వైస్ఎంపిపి తాండ్ర రాజేష్, జి.రామచంద్రం, వైసిపి నాయకులు కె.నరసింహారాజు, రామిరెడ్డి పాల్గొన్నారు.



కుక్కునూరులో..

ఏలూరు: పండుగ సమయాల్లో యువత చెడు అలవాట్లు దూరంగా ఉంచేందుకు డివైఎఫ్ఐ, ప్రజా సంఘాలు ప్రతిఏటా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏలూరు వన్‌టౌన్ సిఐ బోణం ఆదిప్రసాద్ అన్నారు. గురువారం పవర్‌పేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, బాల సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను సిఐ ప్రారంభించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అధ్యక్షతన జరిగిన సభలో సిఐ మాట్లాడారు. సమాజంలో మంచిమార్పు తీసుకొచ్చేందుకు ప్రజాసంఘాలు నిరంతరం పనిచ ేయడం అభినందనీయమన్నారు. సంక్రాంతిని యువత సాంప్రదాయబద్ధంగా ఆనందంగా జరుపుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సంక్రాంతి పండుత ఒక మతానికి, కులానికి చెందినది కాదని, ప్రజలంతా ఐక్యంగా జరుపుకునే పండుగ అని అన్నారు. ఇలాంటి పండుగ సమయంలో కొందరు యువకులు కోడి పందేలు, జూదం వల్ల చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని, వాటిపట్ల అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాన్నారు. ఏలూరు వంటి పట్టణాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలు రప్పించి, విద్యార్థులు, యువతీయువకులను పాడు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాల బారిన పడకుండా యువతీయువకులు సన్మార్గంలో నడపాలన్నారు. సిఐటియు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ ఏలూరులో 50 కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఏలూరు నగర కార్యదర్శి పి.శివశంకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ, ఏలూరు విజయ్ జ్యూయలర్స్ శ్రీనివాస్, చెస్ ఆర్బిటర్ డి.లక్ష్మణరావు, సహాయకులు లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం సిఐ ఆది ప్రసాద్ చెస్ ఆడి ఆటలోని మెళకువల గురించి విద్యార్థులతో ముచ్చటించారు.



ఏలూరులో..

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్(1967) సేవలు వినియోగించుకోవాలి : జెసి

ఏలూరు: ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి వినియోగదారులు, ధాన్యం కొనుగోలు సంబంధిత సమస్యల పరిష్కారానికి 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెసి పి.అరుణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన వస్తువుల పంపిణీ, ధాన్యం కొనుగోలులో రైతులు కనీస మద్దతు ధర పొందుతున్నారా, తూనికలు కొలతల సమస్యలు, గ్యాస్ సరఫరా, పెట్రోలు బంకుల్లో, బియ్యం కార్డు సమస్యలతో పాటుగా అన్ని రకాల సమస్యలను వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను పది మంది సిబ్బందితో నెలకొల్పినట్లు ఆయన చెప్పారు. వినియోగాదారులకు హక్కులు కల్పిస్తూ వారిలో చైతన్యం కోసం 2020 జూలైలో చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 18004250082/1967 (పౌరసరఫరాల శాఖ), 18004253157/14445 (ఒకేదేశం, ఒకే రేషన్ కార్డు), 18004252388/155235 (రాష్ట్ర ఆహార కమిషన్), 18004254202 (తూనికలు కొలతల శాఖ) అన్ని టోల్ ఫ్రీ నెంబర్లతో 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నెంబరుగా అనుసంధానం చేశారన్నారు.

పోల్‌రాజ్ కెనాల్‌కు

సామర్థ్యానికి మించి నీటి విడుదల

దెబ్బతింటున్న మినుము పైరు

రైతులు లబోదిబో

చేపల చెరువుల కోసమే నిబంధనలకు విరుద్ధంగా నీరు విడుదల

ప్రజాశక్తి - ముదినేపల్లి

పోల్‌రాజ్ కెనాల్‌కు జలవనరుల శాఖ అధికారులు కాలువ సామర్థ్యానికి మించి నీటిని ఒక్కసారిగా విడుదల చేయడంతో కెనాల్ వెంబడి ఉన్న పలువురి రైతుల మినుము పంట నీటమునిగింది. భారీగా నీరు చేరి మొక్కలు చనిపోతున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలకేంద్రమైన ముదినేపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కౌలు రైతు ఏపూరి బెనర్జీ నాలుగు ఎకరాల్లో 104 రకం మినుము పంట వేశాడు. అలాగే మరో ఐదుగురు రైతులు కూడా కాలువ వెంబడి ఉన్న వ్యవసాయ భూమిలో మినుము సాగుచేశారు. వీరంతా విత్తనాలు చల్లి నెలరోజులవుతోంది. ఈ తరుణంలో గతంలో ఎన్నడూలేని విధంగా సామర్థ్యానికి మించి అధికారులు నీటిని విడుదల చేయడంతో కాలువ వెంబడి ఉన్న పంటల్లోకి కాలువ ఊట చేరి మినుముపైరు నీటమునిగింది. గత పది రోజులుగా నీటిలోనే నానుతూ పంట మొత్తం చనిపోయింది. సుమారు 15 నుంచి 20 ఎకరాల్లో పంట దెబ్బతినింది. అలాగే కాలువకు మరోవైపు గురజాల ఆయకట్టు పరిధిలోకి కూడా ఈ కాలువ ఊట చేరడంతో 40 ఎకరాల్లో మినుము పైరుకు నష్టం వాటిల్లింది. గతంలో ఈ పరిస్థితి ఎన్నడూ లేదని, జలవనరుల శాఖ అధికారులు చేపల చెరువులకు నీటిని విడుదల చేసే క్రమంలోనే తమ పొలాల్లోకి భారీగా నీటి ఊట చేరి పైరు చనిపోయిందని రైతులు చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను కౌలురైతు బెనర్జీ ప్రశ్నించగా కాలువకు ఎందుకు నీరు వదులుతున్నారో తమకు తెలియదని చెప్పడం విశేషం. ఈ క్రమంలో రైతులు తమ పంటను రక్షించుకునేందుకు ఇంజన్లతో చేలల్లో నీటిని బయటకు తోడుతున్నారు. అయినప్పటికీ మరుసటి రోజుకు మళ్లీ నీరు వచ్చి చేరుతుందని, దీంతో ప్రయోజనం లేకుండాపోతుందని రైతులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తన పంటకు నష్టం వాటిల్లిందని, నష్ట పరిహారం ఇవ్వాలంటూ రైతులు అధికారులను కోరుతున్నారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో జలవనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ గతనెల ఐదో తేదీ వరకు మాత్రమే కాలువలకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తర్వాత కాలువలు నిలుపుదల చేస్తామని చెప్పారు. ఆలోపు తాగునీటి చెరువులను పూర్తిగా నింపుకోవాలని సర్పంచులను సైతం కోరారు. రైతులకు నీటి అవసరం లేని సమయంలో ప్రస్తుతం నీటిని ఎందుకు పోల్‌రాజ్, సిబి కెనాల్‌లకు విడుదల చేస్తున్నారో అర్థం కావడంలేదని పలువురు రైతులు అంటున్నారు. ఎవరి స్వలాభం కోసం నీటిని సరఫరా చేస్తున్నారో అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.



ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు, పెదపాడు మండలాల పరిధిలో ధాన్యం కొనుగోలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరులోని కలెక్టరేట్ వద్ద రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజు భార్గవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు, పెదపాడు మండలాల పరిధిలో రెండో పంటకు సాగునీరు లేకపోవడంతో ఖరీఫ్ పంట కోతలు కోసి కుప్పలుగా వేసుకుని ప్రస్తుతం నూర్పుడి చేసుకుని రైతులు ధాన్యం విక్రయిస్తున్నారని చెప్పారు. మాండూస్ తుపాను ప్రభావంతో తడిసి రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగు ఆదేశాలు ఇవ్వకపోవడంతో కొద్దిపాటి రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో అయినకాడికి అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంచులు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైస్ మిల్లుల బిజీల సమస్యతో ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోయి ట్రాక్టర్లలో, లారీలలో లోడ్ చేసి తూకం వేసిన ధాన్యానికి ట్రక్ షీట్లు జనరేట్ కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రక్ షీట్ జనరేట్ అయ్యి ధాన్యం మిల్లుకు తోలిన తర్వాత ముక్కవుతుందని, నూకశాతం ఎక్కువగా ఉందని, పాయ వచ్చిందని రకరకాల కారణాలు చెప్పి తరుగు పేరుతో మిల్లుల వద్ద రైతుల నుండి డబ్బులు కట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు కట్టకపోతే ధాన్యాన్ని అన్‌లోడ్ చేయడం లేదన్నారు. గోనె సంచులు అందించాలన్నారు. బ్యాంక్ గ్యారంటీల సమస్య పరిష్కరించి ఆన్‌లైన్‌లో ట్రక్ షీట్లు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిబోయిన కాశీ విశ్వనాథం, పల్లపోతు శ్రీనివాసరావు, కన్నెగంటి పూర్ణచంద్రరావు, బూసి సుబ్బరాజు, మందపాటి శివశంకర్‌రావు, వై.సురేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ కోరుతూ ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని పుట్రేపు, కృష్ణాపురం, ప్రకాష్‌నగర్, రుద్రకోటరాజుగూడెం, కాపుగూడెం గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయా గ్రామాలకు చెందిన యువకులు మంగళవారం ఎంపిడిఒ ఎన్.తిరుపతిస్వామికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.నరసాపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఐదు గ్రామాల రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను వివరించారు. పూర్తి ఎస్‌సి, ఎస్‌టి గ్రామాలుగా ఉన్న వీటిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా వేణుగోపాల్, కుంజా రవికిరణ్, వెంకటేశ్వరావు, పండు వీరభద్రుడు, రాంబాబు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

భీమడోలు: రైతులు పంట యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించాలని ఏలూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.ఫణికుమార్ తెలిపారు. మండలంలో వేసిన వరి నాట్లు చనిపోవడం, దుబ్బులు కుళ్లిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారుల విజ్ఞప్తి మేరకు ఏరువాక శాస్త్రవేత్త మండలంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పొలసానిపల్లి, దుద్దేపూడి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతులు సార్వా - దాళ్వా మధ్యకాలంలో నిర్వహించే దమ్ము, దుక్కుల మధ్య తగినంత వ్యవధి ఇవ్వకుండా వేసిన నాట్లు చనిపోతున్నాయని గుర్తించామన్నారు. పైరు మొదలు కుళ్లిపోతుందన్నారు. దీనికి భూమిలో సల్ఫర్ శాతం పెరగడం ఒక కారణమన్నారు. పొలంలోకి దిగిన సమయంలో బుడగలతో గ్యాస్‌పైకి వస్తుందని, దీని ద్వారా సమస్యను గుర్తించ వచ్చని తెలిపారు. సాంకేతికంగా దీనిని సల్ఫడ్ ఇంజరీగా పేర్కొంటారన్నారు. ఈ సమస్యలను తొలగించే క్రమంలో పొలంలో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా తీసివేసి, చిన్నపాటి నెర్రలు ఏర్పడే వరకూ ఎండగట్టాలని సూచించారు. ఆ తర్వాత పొలంలో నీరు పెట్టాలన్నారు. సల్ఫర్ శాతం ఉన్న ఎరువులను వాడొద్దని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ మల్లికార్జునరావు

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి
డిపిఒ జివికె.మల్లికార్జునరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మార్చి 31లోపు ప్రతి పంచాయతీలో నూరుశాతం పన్నుల వసూలుకు కార్యదర్శులు చర్యలు చేపట్టాలని డిపిఒ జివికె.మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని తెడ్లంలో పొంత దారిని కొందరు ఆక్రమించారని అందిన ఫిర్యాదు మేరకు ఆయన ఆ స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పన్ను వసూళ్లలో వెనకబడి ఉన్నారని, ఇప్పటి వరకు 40 శాతం మాత్రమే వసూలయ్యాయని చెప్పారు. నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికి చెత్త సేకరణ పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. చెత్త సేకరణ ద్వారా పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. వెంగపాడులో సచివాలయం, రైతుభరోసా కేంద్రం నిర్మాణాలకు గ్రామానికి చెందిన దాత 20 సెంట్లు ఇచ్చారని, ఆయనకు మరోచోట స్థలం ఏర్పాటు చేసి వాటి నిర్మాణాలు చేపట్టాలని ఎంపిడిఒను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.తిరుపతి స్వామి, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో అవగాహన కార్యక్రమం

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రానున్న సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూదాలకు దూరంగా ఉండాలని ఎంపిడిఒ మంగతాయారు తెలిపారు. మండలంలోని కామయ్యాపాలెం పంచాయతీలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని సూచించారు. కోడి పందేలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలు ఆడిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవ ప్రియుడు, విఆర్ఒ అశోక్, మహిళ పోలీసు పాల్గొన్నారు.

గణపవరం : పండగ పేరుతో గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని కాశిపాడు గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆనందంగా జరుపుకోవాల్సిన పండుగ రోజుల్లో కోడిపందేలు, గుండాట, పేకాట వంటి ఆటల వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఆర్‌డి రామారావు, ఎంపిటిసి సభ్యులు జంపన పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మండలంలో కోడిపందేలు నిర్వహించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తహశీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. మండలంలోని టెక్కినవారిగూడెం, నిమ్మలగూడెం, అమ్మపాలెం, కట్టవ పొదలవారిగూడెం గ్రామాల్లో తహశీల్దార్ స్లీవజోజి ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించినట్లు తెలిస్తే గ్రామస్తులు పోలీసులకు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ గ్రామ సభల్లో ఆయా గ్రామాల , సర్పంచ్ లు, ఎంపిటిసి లు వార్డు సభ్యులు,సచివాలయ, రెవెన్యూ,పోలీసు సిబ్బంది ,గ్రామ వాలంటీర్లు, గ్రామస్థులు ,నాయకులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : మండలంలోని కొమ్ముగూడెం, పైదవారిగూడెం గ్రామాల్లో తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి, ఎస్ఐ జయబాబు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చెప్పారు. పేకాట, కోడిపందేలు వంటి జూదాల వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. పండుగ సమయాల్లో ఇటువంటి పరిస్థితులు తెచ్చుకోవద్దని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలల్లో పాల్గొన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మడుగూడెం గ్రామ పంచాయతీ సర్పంచి మడకం రామలక్ష్మి, సెక్రటరీ రవి, విఆర్ఒ అశ, మహిళా పోలీసులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని రాఘవపురం, లింగగూడెం గ్రామాల్లో తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎస్ఐ డి.హరికృష్ణ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సాంప్రదాయ పద్ధతిలో చేసుకోవాలని సూచించారు. జూదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. నేటి ఆధునిక యువతకు పండుగ విశిష్టత గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

రణస్థలం సభకు తరలిన జన సైనికులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే యువశక్తి సభకు జనసేన పార్టీ ఉంగుటూరు నియోజవర్గ ఇన్‌ఛార్జి ధర్మరాజు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో జన సైనికులు తరలివెళ్లారు. నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు, భీమడోలు మండలాల నుంచి యువత పవన్‌కల్యాణ్ సభకు బుధవారం సాయంత్రం ర్యాలీగా వెళ్లారు.

నేరాలు - ఘోరాలు

చేతి పంపుల హెడ్‌లు అపహరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక కైకలూరు రోడ్డులోని వినాయకుని ఆలయం వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మూడు చేతి పంపు హెడ్‌లు అపహరణకు గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో పంపుల హెడ్‌లు ఊడతీసి ఎత్తుకుపోయారు. ఉదయం ప్రజలు మంచినీటి కోసం అక్కడకు రాగా బోర్లకు హెడ్‌లు లేకపోవడంతో నిరుత్సాహంతో వెనక్కి వెళ్లిపోయారు. ఈ విషయమై ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చేతి పంపుల ద్వారా నిత్యం ఐదు గ్రామాల ప్రజలు దాహార్తిని తీర్చుకుంటున్నారు.

లారీలో మంటలు - తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


షార్ట్ స ర్క్యూట్‌తో లారీలో మంటలు చెలరేగాయి. ఐ.పంగిడి నుంచి తెలంగాణ రాష్ట్రం వినాయకపురానికి వెళ్తున్న టిప్పర్ లారీలో బుట్టాయగూడెం శివాలయం సమీపంలోకి వచ్చేసరికి షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. లారీ వెనుక వస్తున్న వాహన చోదకులు మంటలను గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. అదే సమయంలో హైవే రోడ్డు పనుల నిమిత్తం రోడ్డు మార్జిన్ తడుపుతున్న వాటర్ ట్యాంకర్ అందుబాటులో ఉండటంతో మంటలను అదుపుచేశారు.

మంచెం గోపాలకృష్ణయ్య సేవలు మరువలేనివి

నేడు శిలా విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమడోలు

పంచాయతీ సర్పంచి పదవీకాలం కొన్ని సంవత్సరాల్లో పూర్తవుతుంది. ఈ సందర్భంగా సర్పంచి తన హయాంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలు ఆ తర్వాత కాలంలో కొంతకాలం మాత్రం గుర్తు చేసుకుంటారు. దీనికి భిన్నంగా భీమడోలులో గ్రామపంచాయతీ సర్పంచిగా 1951 సంవత్సరం నుంచి 1988 సంవత్సరాల మధ్య మూడు పర్యాయాలుగా 27 సంవత్సరాల కాలం పనిచేసిన వ్యక్తి సేవలను గ్రామస్తులు ఇప్పటికీ తల్చుకుంటున్నారు. ఆయనే మంచెం గోపాలకృష్ణయ్య. ఆయన చేసిన స్వార్థరహిత సేవలు, యువజనుల సంక్షేమానికి అమలు చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు భీమడోలు గ్రామపంచాయతీ ఆవరణలో ఆయన శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన ఆయన కుటుంబ సభ్యులు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఈతకోట సుబ్బారావు ఆధ్వర్యంలో 16 మంది విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులుగా ఏర్పడి విగ్రహ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం 105 సంవత్సరాల చరిత్ర గల భీమడోలు గ్రామ పంచాయతీ 1918లో ఏర్పాటైంది. ఇప్పటివరకు 23 మంది గ్రామ పంచాయతీ అధ్యక్షులుగా 1950వ సంవత్సరం నుంచి గ్రామ సర్పంచులుగా పని చేశారు. పంచాయతీ ఆవిర్భావం సందర్భంగా తొలి అధ్యక్షులుగా దత్తాద లక్ష్మీనర్సరాజు 1918 -27 సంవత్సరాల మధ్య పది సంవత్సరాలపాటు మూడుసార్లు.... అధ్యక్షులుగా పని చేశారు. ఆ తర్వాత కాలంలో సీతాల సుకాల రామయ్య 1929-37 సంవత్సరాల మధ్య ఎనిమిది సంవత్సరాలపాటు రెండు పర్యాయాలు సర్పంచిగా పని చేశారు. 1932 -40 సంవత్సరాల మధ్య పద్మ మునిస్వామి ఐదు సంవత్సరాల కాలం లో రెండు పర్యాయాలు అధ్యక్షులుగా పని చేశారు. 1940 - 51 సంవత్సరాల మధ్య సీతాల భద్రాచలం 11 సంవత్సరాల పాటు అధ్యక్షులుగా పని చేశారు. ఆ తర్వాత కాలంలో మంచెం గోపాలకృష్ణయ్య 1951-88 సంవత్సరాల మధ్య తొలి విడతలో తొమ్మిది సంవత్సరాలు, రెండో విడతలో పది సంవత్సరాలు, మూడో విడతలో ఎనిమిది సంవత్సరాల తర్వాత కలిసి మొత్తంగా 27 సంవత్సరాల పాటు సర్పంచిగా పని చేసి రికార్డు సృష్టించారు. ఆయన శిలా విగ్రహం ఏర్పాటుకు గ్రామస్తులు గ్రామపంచాయతీని సంప్రదించగా ప్రస్తుత సర్పంచిగా పనిచేస్తున్న పాము సునీత మార్సింగ్ ఆధ్వర్యంలోని పాలకమండలి పంచాయతీ ఆవరణలో విగ్రహం ఏర్పాటుకు అనుమతించారు. మంచెం గోపాలకృష్ణయ్య సేవలు ప్రజలకు గుర్తు ఉండేవిధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఆయన సమ కాలికులు కొందరిని గోపాలకృష్ణయ్య కుటుంబ సభ్యుల చేతుల మీదుగా సన్మానించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


గోపాలకృష్ణయ్య శిలా విగ్రహం

ఉపాధి హామీ కూలీల సమస్యలపై వ్యకాస పోరాటం

క్యాలెండర్ ఆవిష్కరణలో జిల్లా డ్వామా పీడీ రాంబాబు

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధి హామీ కూలీల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పని చేస్తుందని జిల్లా డ్వామా పీడీ రాంబాబు అన్నారు. స్థానిక జిల్లా డ్వామా ఆఫీసులో వ్యవసాయ కార్మికుల సం ఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్‌ను ఆయన బుధ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, పేదలు, అభ్యుదయ వాదులకు ఉపయోగపడేలా 2023 క్యాలెండర్‌ను ముద్రించినట్లు తెలిపారు. గ్రామీణ పేదలు సమస్యలపై పని చేయడంతో పాటు భూ మి, ఉపాధి హామీ, కూలి పెంచుకోవడం కోసం ఆందోళన పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ నూతన సంవత్సరంలో భూమి కోసం, ఉపాధి హామీ పరిరక్షణ కోసం, పెద్ద ఎత్తున పోరాటాలకు నాంది పలు కుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఉపాధ్యక్షులు ఎ.రవి పాల్గొన్నారు.


ఎంపి కోటగిరి ఫొటో క్యాలెండర్ ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం : ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్‌బాబు ఫొటో క్యాలెండర్‌ను స్థానిక వైసిపి నేతల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎంపి శ్రీధర్‌బాబు ఫొటో, తాడువాయి గ్రామ సొసైటీ అధ్యక్షులు వీరంకి సత్యనారాయణ ఫొటో ఉన్న క్యాలెండర్‌ను స్థానిక వైసిపి సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్ బుధవరం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్లు అయినాల వెంకటరమణమూర్తి, సంకు సురేష్, వైసిపి నాయకులు కేమిశెట్టి మల్లిబాబు, సొసైటీ డైరెక్టర్ చప్పాడ వెంకన్న, నేట్రు గణేష్, డి.రాజేష్ పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తిచే ఐలు క్యాలెండర్ ఆవిష్కరణ

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ముద్రించిన వాల్, జేబు క్యాలెంబర్లను జిల్లా కోర్టులోని జిల్లా జడ్జి ఛాంబర్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్.పురుషోత్తం కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలు జూనియర్ న్యాయవాదుల కోసం శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారి వృత్తి నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఐలు జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ మాట్లాడుతూ ఐలు న్యాయవాదుల సంక్షేమం, చట్టాలు అమలు ద్వారా కోర్టులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.శశిధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిహెచ్.రమేష్, నగర ఐలు కార్యదర్శి జి.విజయభాస్కర్, నాయకులు కూన కృష్ణారావు, పి.పరమేశ్వరరావు, పి.వెంకట్, వై.మణికంఠ పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా సంక్రాంతి సంబరాలు


ఏలూరు న్యూ జనరేషన్ స్కూలులో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ఎన్ఆర్ఐ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలను పూలతో ముగ్గులు, గొబ్బెమ్మలతో అలంకరించి, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి కళాశాల సిఇఒ వి.తులసీరామ్ బహుమతులు అందించారు. అనంతరం హరిదాసుని పాటలు, భోగిమంటలు, గంగిరెద్దు విన్యాసాలతో కనువిందుగా అలరించారు. వివిధ రకాల సాంప్రదాయ పిండివంటలు ప్రదర్శించి అందరికీ రుచులను అందించారు. కళాశాల సిఇఒ వి.తులసీరామ్ మాట్లాడుతూ మన సాంప్రదాయం, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్ వి.కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, సిహెచ్ ఎన్‌వి.సత్యనారాయణ, సిహెచ్. శివకుమార్, ఎఒలు కె.మల్లికార్జునరావు, వి.రాట్నాలు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక గాంధీనగర్ న్యూజనరేషన్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భోగిమంటలు, గొబ్బెమ్మలు, చిన్నారులకు భోగి పండ్లు పోశారు. స్థానిక ఏలూరు నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీను, 47వ డివిజన్ కార్పొరేటర్ తుమరాడ స్రవంతి చిన్నారులను ఆశీర్వదించారు. పాఠశాల సంచాలకులు ఎన్ఆర్‌కెఎ.ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వారి సాంప్రదాయ విశిష్టత గురించి వివరించారు.

ముదినేపల్లి : ముదినేపల్లి సాయిరాం డిగ్రీ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ తనయులు దూలం వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి మనందరికి నవ్యక్రాంతి తేవాలన్నారు. తెలుగుతనం ఉట్టిపడేలా సాంప్రదాయ వస్త్రధారణలతో అలంకరించిన విద్యార్థులు బుట్టబొమ్మలా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల ప్రదర్శనలు అందరిని అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, డెరెక్టర్ గంటా సంధ్య, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, వైస్ ఎంపిపి రాధా, సునీత, వైసిపి నేత నిమ్మగడ్డ భిక్షాలు పాల్గొన్నారు.


భీమడోలు శ్రీచైతన్య పాఠశాలలో...

భీమడోలు : భీమడోలు శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి కార్యక్రమాలకు విద్యార్థులు, వారి కుటుంబ సభ్యుల నుంచి ఆదరణ లభించిందని ప్రిన్సిపల్ డి.సోనీ తెలిపారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి వివిధ వేషధారణలతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. భోగి మంటలు వేశారు. గొబ్బెమ్మలతో సంక్రాంతిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థులను భోగి పండ్లతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త సిహెచ్.ఉదయభాస్కర్, డీన్ భార్గవకిరణ్, ఎఒ ముఖేష్ పాల్గొన్నారు.

పలుచోట్ల క్రీడా పోటీలు ప్రారంభం


పుళ్లలో పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచి సుజాతప్రసాద్

ప్రజాశక్తి - భీమడోలు

సంక్రాంతిని పురస్కరించుకుని సాంప్రదాయం పేరుతో జూదాలు, కోడిపందేలు ఆడటం సరికాదని భీమడోలు ఎస్ఐ చావా సురేష్ హితవు పలికారు. భీమడోలు పోలీసుల ఆధ్వర్యంలో పూళ్ల హైస్కూల్ గ్రౌండ్ వేదికగా క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువతలో ఉత్తేజాన్ని నింపేందుకు, వారు ఇతర కార్యక్రమాల పట్ల ఆకర్షితులు కాకుండా ఉండేందుకు పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలను సర్పంచి దాయం సుజాతప్రసాద్ ప్రారంభించగా వికెట్ కీపర్‌గా సర్పంచి భర్త దాయం ప్రసాద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీకి చెందిన పలువురు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో వాలీబాల్ పోటీలు ప్రారంభం

టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెం లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో మండలంలోని బచ్చులేటిగూడెం, రామమ్మగూడెం, టి.నరసాపురం మొత్తం 11 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జూదం, కోడిపందెం, గుండాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

చింతలపూడి : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తహశీల్దార్ కృష్ణజ్యోతి అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో టి.సురేష్ టీం చింతలపూడి సుప్రీంపేట విజేతగా, రామచంద్ర టీం బోయగూడెం రన్నర్‌గా నిలిచారు. ఈ పోటీలో ప్రతిభవంతులకు మొదటి బహుమతి రూ.ఐదు వేలు, ద్వితీయ రూ.నాలుగు వేలు, మండల, డివిజన్ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన వారికి మొదటి బహుమతి రూ.పది వేలు, ద్విదీయ బహుమతి రూ.8 వేలు కలెక్టర్ చేతుల మీదుగా అందించనున్నట్లు తెలిపారు.

టోర్నీ విజేత ముదినేపల్లి పోలీస్11 జట్టు

ముదినేపల్లి : మండలంలోని గురజలో గత ఎనిమిది రోజులుగా ముదినేపల్లి పోలీసులు ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిశాయి. మొత్తం 40 టీములు ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ ముదినేపల్లి పోలీస్ 11 , ముదినేపల్లి జట్టు మధ్య జరిగింది. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముదినేపల్లి జట్టుపై ముదినేపల్లి పోలీస్ 11 జట్టు ఒక పరుగు తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముదినేపల్లి పోలీస్ 11 జట్టు నిర్ణీత 12 ఓవర్లల్లో 44 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముదినేపల్లి జట్టు 43 పరుగులకే ఆల్‌అవుట్ అయింది. ఒక పరుగు తేడాతో ముదినేపల్లి పోలీస్ 11 జట్టు విజయం సాధించింది. విజేతలకు గురువారం కైకలూరులో జరిగే కార్యక్రమంలో ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు బహూమతులు అందిస్తారు. ముదినేపల్లి పోలీస్ 11 జట్టుకు కెప్టెన్‌గా ఎస్ఐ షణ్ముఖసాయి, ముదినేపల్లి జట్టుకు దివి సతీష్ కెప్టెన్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ తనయులు దూలం ఆదివినయ్‌కుమార్, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైసిపి నేతలు పాల్గొన్నారు.


విజేతగా నిలిచిన ముదినేపల్లి పోలీస్ 11 జట్టు

ప్రతి నెలా 14న హెల్త్ మేళా

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రతి నెల 14వ తేదీన గ్రామ సచివాలయం వద్ద హెల్త్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్ నాయుడు తెలిపారు. బుధవారం ఆసుపత్రి పరిధిలో సచివాలయం వద్ద ఏడాది లోపు పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల లోపు పిల్లలకు దగ్గు జలుబు ఉంటే వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని చెప్పారు. వల్లూరులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సిహెచ్‌ఒ జె.విల్సన్‌బాబు, పిహెచ్‌ఎన్ జి.వరలక్ష్మి ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.